దానిమ్మకు తుపాను దెబ్బ!

- రాలిన పిందెలు, పూత
- ఎండు తెగులు, మచ్చ తెగుళ్లతో రైతుల ఆందోళన

దానిమ్మ పంట సాగు ఇలా..

మండలం	ఎకరాలు
యల్లనూరు	1,235
పెద్దపప్పూరు	1,014
తాడిపత్రి	470
యాడికి	81



తుపాను కారణంగా కాయలకు మచ్చ తెగులు సోకిన దృశ్యం



పిందెలు, పూత కాలిపోయిన దృశ్యం

తాడిపత్రి రూరల్: రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన దానిమ్మ పంటను తుపాను దెబ్బ తీస్తోంది. భారీ వర్షాల వల్ల చెట్లపై ఉన్న పూత, పిందెలు రాలుతున్నాయి. పూలు, పిందెలతో కళకళలాడిన చెట్లు పలు చోట్ల తుపానుతో బోసిపోతున్నాయి. దీంతో పక్వానికి వస్తున్న కాయలపై మచ్చలు పడుతున్నాయి. మచ్చలు పడ్డ కాయలకు డిమాండ్ తక్కువ ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెట్లపై ఎక్కువ శాతం మచ్చలున్న కాయలు కనిపిస్తున్నాయి. అలాగే రసాయన ఎరువులను ఎక్కువ మోతాదులో వాడుతుండటంతో నేల స్వభావం మారడంతో పాటు ఇతర కారణాల వల్ల చెట్లకు ఎండు తెగులు సోకుతోంది. పచ్చగా ఉన్న చెట్లు ఎండు తెగులుతో నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవన ఎరువులు, ఇతర సాంప్రదాయ పద్ధతులను ఉపయోగించడం వల్ల కొంత వరకూ ఎండుతెగులును అరికట్టవచ్చని అధికారులు అంటున్నారు. దానిమ్మను వైరస్ తెగులు కూడా రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పక్వానికి వస్తున్న కాయలు చెట్టుపైన కుళ్లిపోయి కిందకి రాలిపోతున్నాయి. వైరస్‌తెగులు నియంత్రణ కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

వందల ఎకరాల్లో దానిమ్మ సాగు

తాడిపత్రి ప్రాంతంలో వేల ఎకరాల్లో దానిమ్మ పంటను రైతులు సాగు చేస్తున్నారు. సీజన్‌లో టన్ను రూ.లక్షకు పైగా పలుకుతోంది. డిమాండ్‌ను బట్టి ఇంకా ఎక్కువగా ధర ఉంటోంది. దానిమ్మ లాభాల పంటగా మారడంతో రైతులు పండించడానికి మక్కువ చూపుతున్నారు. దానిమ్మను ఎక్కువగా పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నె, ముచ్చుకోట, జూటూరు, పెద్దపప్పూరు, పెద్ద ఎక్కలూరు, తాడిపత్రి మండలంలో భోగసముద్రం, గద్దరగుట్టపల్లి, వెంకటరెడ్డిపల్లి, గంగాదేవిపల్లి, యర్రగుంటపల్లి, యల్లనూరు మండలంలో బుక్కాపురం, వెన్నపూసపల్లి, వేములపల్లి తదితర గ్రామాల్లో సాగు చేస్తున్నారు.

పూత, పిందెలు రాలిపోతున్నాయి



తుపాను కారణంగా దానిమ్మ చెట్లలో పూత, పిందెలు రాలిపోతున్నాయి. మూడు ఎకరాల్లో వేసిన పంట ప్రస్తుతం చేతికి వస్తోంది. కాయలు పక్వానికి వస్తున్నాయి. ఈ సమయంలో ఎండు తెగులు సోకుతోంది. మచ్చ తెగులు, వైరస్ తెగులు వల్ల కాయలు దెబ్బతింటున్నాయి. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది

– సూర్యనారాణరెడ్డి, రైతు, యర్రగుంటపల్లి

ముందు జగ్రత్తలు తీసుకోవాలి



దానిమ్మ పంటకు వ్యాపించే వివిధ రకాల తెగుళ్లను ముందుస్తు జాగ్రత్తలతో ప్రభావం తగ్గించవచ్చు. తెగుళ్లు సోకిన వెంటనే హార్టికల్చర్ అధికారులు సమాచారం ఇవ్వాలి. తుపాను వల్ల నష్టపోయిన దానిమ్మ తోటల వివరాలు అందించాలి. క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిహారం అందేలా చూస్తాం.

– ఉమాదేవి, హార్టికల్చర్ అధికారి, తాడిపత్రి

క్లుప్తంగా

'ఆయుష్మాన్ భవ'పై అవగాహన



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో శనివారం సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్‌భవ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు శస్త్ర చికిత్స, ఇతర ఆరోగ్య పరమైన వైద్యం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు పరమేశ్వర్, మందిర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సమస్య పరిష్కరించండి



కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు సమస్యను విన్నవిస్తున్న కాలనీవాసులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 16వ వార్డు తిలక్‌నగర్ మదీనా మసీదు ఏరియాలో ఇంటింటా చెత్త సేకరణకు సిబ్బంది సక్రమంగా రావట్లేదని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం ఆయన 16వ వార్డులో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. చెత్తాచెదారాన్ని రోడ్లు, డ్రైనేజీల్లో పడేయరాదని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటింటా చెత్తసేకరణ క్రమంగా జరిగేలా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు సెక్రటరీలను ఆయన ఆదేశించారు.

అరటి పంట పరిశీలన



అరటి పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, హెచ్ఓ

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో రైతు మద్దిలేటి స్వామి సాగు చేసిన అరటి పంటను పులివెందుల అరటి రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త శివరామకృష్ణ శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన కౌలు రైతు మద్దిలేటి స్వామి జైన్ కంపెనీ నుంచి అరటి మొక్కలు కొనుగోలు చేసి ఈ ఏడాది మే 3న 12 ఎకరాల్లో అరటి పంట సాగు చేశాడు. అయితే మొక్కలు ఎదుగుదల లేకపోవడంతో రైతు ఉద్యాన అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పులివేందుల నుంచి శాస్త్రవేత్త వచ్చి అరటి మొక్కలను పరిశీలించారు. మొక్కల ఎదుగుదల లేకపోవడంతో తాను తీవ్రంగా నష్టపోయానని, ఆదుకోవాలని రైతు అధికారులను వేడుకున్నాడు. కార్యక్రమంలో హెచ్ఓ మిత్రవిందమాధవి, ఏఓ ముస్తాక్ అహ్మద్, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వీరరాజు

యాడికి: సచివాలయ సిబ్బంది విధుల్లో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ వీరరాజు సూచించారు. మండలంలోని నిట్టూరు సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ సందర్శించారు. సచివాలయానికి వచ్చి ఫిర్యాదులు వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించడంతోపాటు విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ యల్లమనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌరీమాత వ్రతం



గౌరమ్మ ప్రతిమ నగర ప్రదర్శన దృశ్యం

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ మాత ఆలయంలో శనివారం వాసవీ మాతృ మండలి ఆధ్వర్యంలో ఆశ్వయుజ పౌర్ణమి గౌరీవ్రతం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్య వైశ్య మహిళలు గౌరమ్మ ప్రతిమను శోభాయానంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమను మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం గౌరమ్మ ప్రతిమను పెన్నానదిలో భక్తిశ్రద్ధల నడుమ నిమజ్జనం చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



గుత్తి మండలం మార్నేపల్లిలో సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్



గార్లదిన్నె మండలం కల్లూరు అగ్రహారంలో గ్రామ సభ నిర్వహించిన అధికారులు

గుత్తి రూరల్/గార్లదిన్నె/పామిడి: గ్రామాల్లో రీసర్వే పూర్తయి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఓబిలేసు అన్నారు. శనివారం గుత్తి మండలంలోని మార్నేపల్లి, ధర్మాపురం గ్రామాల్లో తహసీల్దార్ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మ్యుటేషన్లు, ఖాతా నంబర్లు, పట్టాదారు పాసుపుస్తకాలలో పేరు తప్పులు, ఆధార్ నంబర్లు, సెల్‌ఫోన్ నంబర్లు తప్పుగా పడి ఉంటే రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీలత, వీఆర్ఓ రంగయ్య, సర్వేయర్ సాయి పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలోని కల్లూరు అగ్రహారం ,కొప్ప లకొండ గ్రామాల్లో భూ రీ సర్వేపై అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ, భూ రీ సర్వే డీటీ దివాకర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని అప్పాజీపేట, దేవరపల్లి గ్రామాల్లో శనివారం తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో రీ సర్వేపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వేలో ఉత్పన్నమైన సమస్యల పరిష్కారంపై సమీక్షించారు.

కొనసాగుతున్న 'పల్లె పండుగ'



పామిడి మండలం ఎదురూరులో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ తేజోత్స్న



గార్లదిన్నె మండలం యర్రగుంట్లలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

శింగనమల/యల్లనూరు/గార్లదిన్నె/పామిడి: శింగనమల మండలంలోని శివపురంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఏపీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరు మండలంలోని దుగ్గుపల్లి, కల్లూరు, వెంకటాంపల్లి, లింగారెడ్డిపల్లి, మల్లాగుండ్ల గ్రామాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఏపీవో షబ్బీర్‌బాషా ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా గార్లదిన్నె మండలంలోని యర్రగుంట్ల, పెనకచెర్ల, పెనకచెర్లడ్యాం గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని ఎదురూరు, జీ కొట్టాల, పాళ్యంతండా గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీడీఓ తేజ్యోత్స్న, ఈఓఆర్డీ కృష్ణకుమార్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కత్రిమల ప్రభాకర్ చౌదరి, ముసలిరెడ్డి, బొల్లు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.

అన్న క్యాంటీన్ తనిఖీ



మాట్లాడుతున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో ఉన్న అన్న క్యాంటీన్‌ను శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అల్పాహారం నాణ్యత, తాగునీటిని పరిశీలించారు. పరిశుభ్రతను పాటించాలని క్యాంటీన్ నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి అర్బన్: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి రోటరీ క్లబ్ అనుబంధ విభాగమైన ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. వివరాలు.. స్థానిక విజయనగర్ కాలనీలోని షేక్షావలి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న ఈవిషయాన్ని తెలుసుకున్న ఇన్నర్‌వీల్ సభ్యులు బాధితుడి నివాసానికి చేరుకుని నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కౌసర్‌బేగం, సభ్యులు ప్రశాంతి, సవేరా, లలిత, రషీదాలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని శర్మాస్ కాలనీలో ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు బీకేఎస్ సీఐ కరుణాకర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.98 వేల నగదు, 7 సెల్‌ఫోన్లు 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

22 నుంచి ఆధార్ సేవలు

పామిడి: మండలంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ ఆధార్ మొబైల్ సేవలను నిర్వహిస్తామని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి శనివారం తెలిపారు. మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహించే కార్యక్రమాల్లో ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు వంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'కెనాల్‌పై వంతెన నిర్మించండి'

బుక్కరాయసముద్రం: మండలంలోని కేకే అగ్రహారం, దుర్గం, ఏడావులపర్తి గ్రామాలకు వెళ్లేందుకు హెచ్ఎల్‌సీ కెనాల్‌పై బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నల్లప్ప డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో రోడ్లపై రోడ్లు వేసేందుకు ఉన్న శ్రద్ధ రైతులకు ఉపయోగ పడే బ్రిడ్జి నిర్మాణంపై లేదన్నారు. నీరు రానప్పుడు కాలువలోకి దిగి రైతులు వెళ్లేవారన్నారు. నీరు వచ్చాక అవతలి గ్రామాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతు ఆత్మహత్యాయత్నం

యాడికి: ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలంలోని కండ్లగూడూరు గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణరెడ్డి పత్తిలో చీడ పురుగుల నివారణ కోసం తెచ్చిన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని ఓ వాహనంలో పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



గుంతకల్లులో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు: దీపావళిని పురస్కరించుకుని టపాసు విక్రయదారులు నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ శ్రీనివాస్, డీయస్పీ ఆముదాల శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఫైర్ ఆఫీసర్స్, దుకాణాలు ఏర్పాటు చేసుకునే లైసెన్స్‌దారులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గుంతకల్లు సబ్ డివిజన్ వ్యాప్తంగా గుంతకల్లు 13, గుత్తి 14, పామిడి 8, పెద్దవడూరు 3, ఉరవకొండ 10, యాడికి 8 చొప్పున లైసెన్సులు కల్గిన టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తారన్నారు. గుంతకల్లులో రైల్వే గ్రౌండ్‌లో టపాసు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దుకాణాల వద్ద నీరు, ఇసుకతో పాటు మంటలను అదుపు చేసే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, అగ్నిమాపక శాఖ అధికారి పాల్గొన్నారు.

గార్లదిన్నె: అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా హెచ్చరించారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా టపాసులు విక్రయించాలంటే లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మండలంలోని గార్లదిన్నెలో ముగ్గురు, కల్లూరులో ముగ్గురు టపాసుల విక్రయ కేంద్రా లు ఏర్పాటుకు లైసెన్స్ పొందారన్నారు. టపాసుల విక్రయ కేంద్రాలు వద్ద అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



గుత్తి మండలంలోని హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి

పామిడి/గుత్తి రూరల్: హాస్టళ్లలోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి సూచించారు. పామిడిలోని హాస్టల్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు, హాస్టల్ గదులు, వంట గదులు, బాత్‌రూంలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్య, ఆరోగ్య పరంగా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పరంగా పిల్లలకు సంక్షేమ పథకాల వర్తింపుపై వార్డెన్ ఆదినారాయణతో సమీక్షించారు. ఎటువంటి ఇబ్బందులున్నా గుత్తి న్యాయ సేవా సమితికి ఫిర్యాదు చేస్తే తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ ఏసీ గంగాధర్, టైపిస్ట్ ఎస్ సాదిక్‌వలి, పారా లీగల్ వలంటీరు ఇస్మాయిల్ పాల్గొన్నారు. అలాగే గుత్తి మండలంలోని ఇసురాళ్లపల్లి బీసీ హాస్టల్‌ను శనివారం గుత్తి సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వసతి గదులు, మరుగుదొడ్లు, వంటగదులు, పరిసరాలను జడ్జి పరిశీలించారు. మరుగుదొడ్లు, వంటగది, భోజనశాల వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే గుత్తి కోర్టులోని మండల న్యాయ సేవా సమితి కార్యాలయంలో అర్జీల అందజేస్తే తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది వి.సి.గంగాధర్‌కుమార్, టైపిస్ట్ సాదిక్‌వలి, పీఎల్‌వీ ఇస్మాయిల్, వార్డెన్ రామాంజనేయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోండి

గుంతకల్లు: పట్టణంలోని చాలామంది వ్యాపారులు వినియోగదారులకు సమగ్రమైన బిల్లులు ఇవ్వటం లేదని దళిత సంఘం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం సేల్ ట్యాక్స్ అధికారులను కలసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వినియోగదారులకు రసీదు బిల్లు చెల్లించకపోవడం ద్వారా వ్యాపారులు నాన్ జీఎస్టీ కిందకు వస్తారన్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలకు వచ్చే ఆదాయానికి గండి పడుతుందన్నారు. అధికారులు స్పందించి వ్యాపారుల నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎం.మహేంద్ర, ప్రధాన కార్యదర్శి కోరి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వై.భీమలింగ, నాయకులు సంపత్, నరసన్న, రామచంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


కార్మికుడికి గాయాలు



గాయపడిన మౌలా

పామిడి: పట్టణంలోని కృష్ణవేణి ఇంగ్లీష్‌మీడియం స్కూల్ వద్ద భవన నిర్మాణ పనుల్లో శనివారం ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు కిందపడి గాయపడ్డాడు. ఘటనలో కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామవాసి మౌలాకు రక్త గాయాలయ్యాయి. సెంట్రింగ్ పనిలో నిమగ్నమైన అతడు కిందపడడంతో తలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లింగ వివక్ష నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బుక్కరాయసముద్రం: లింగ వివక్షత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యులు ఇందిరా ప్రియదర్శిని, వినోద్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని కొర్రపాడు గ్రామంలో మహిళా సంఘాల సభ్యలతో లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే లింగ వివక్షత నిర్మూలనలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పర్వీన్, శ్రీదేవి, ఇందిరమ్మ, నారాయణస్వామి, రామలక్ష్మి, తిరుపాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తాడిపత్రి అర్బన్: పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు శనివారం అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

మిషనరీస్ ఆఫ్ చారిటీకి విరాళం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని చర్చి స్కూల్ ఆవరణలో ఉన్న మదర్ థెరిస్సా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థకు సెయింట్ మేరీస్ హైస్కూల్ 1999–2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు శనివారం రూ.50 వేల విరాళం అందజేశారు. మానసిక దివ్యాంగులైన మహిళలను కన్నబిడ్డల్లా చూసుకుంటూ సేవలందిస్తున్నందుకు మిషనరీస్ ఆఫ్ చారిటీకి విరాళం అందజేసినట్లు పూర్వవిద్యార్థులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న నాగరాజు

గుంతకల్లుటౌన్: అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఒకటో డివిజన్ కార్యాలయంలో సాధారణ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికులకు పెండింగ్‌లో సరెండర్ లీవ్‌లను అమలు చేయడంతో పాటు పీహెచ్ వర్కర్లకు కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, యూనిఫాం అందజేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా పనిచేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్లు, పీహెచ్ వర్కర్లకు గత ప్రభుత్వం జారీ చేసిన జీఓలను అమలు చేయాలన్నారు. కార్మికులు చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశమివ్వాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా పీహెచ్ వర్కర్ల సంఖ్యను పెంచాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 28న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. మున్సిపల్ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి నరసయ్య, జగదీష్, సభ్యులు రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకూలిన పైకప్పులు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రవూఫ్ మకాన్ ఏరియాలో వర్షానికి శనివారం రెండిళ్ల పైకప్పులు నేలకూలాయి. రవూఫ్ మకాన్ ఏరియాలో నివాసముంటున్న అన్నాదమ్ములు అల్లా బకాష్, సాదిక్ వలి ఇళ్ల పైకప్పులు కూలడంతో వస్తువులన్నీ దెబ్బతిన్నాయి. భారీగా నష్టం వాటిల్లింది. మున్సిపల్ అధికారులు నేల కూలిన ఇళ్లను పరిశీలించారు. బాధితులు మాట్లాడుతూ అధికారులు స్పందించి పరిహారం చెల్లించాలని కోరారు.

ముమ్మరంగా పోలీసుల గస్తీ

గార్లదిన్నె: మండలంలో ఇటీవల చోరీలు ఎక్కువయ్యాయని, చోరీలు అరికట్టేందుకు రాత్రి సమయంలో పోలీసు గస్తీ నిర్వహిస్తున్నామని ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో విద్యుత్ మోటర్లు, స్టార్టర్ పెట్టేలు, డ్రిప్పు వైర్లు, ఏటీఎంలో నగదు చోరీ వంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా గ్రామాల్లో రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేశామన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాద నివారణ చర్యలు చేపట్టామన్నారు. చోరీల్లో అపహరణకు గురైన వాటిని రికవరీ చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలు అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువులతో పాటు వృత్తి నైపుణ్యాలు ఎంతో అవసరం అని ప్రధానోపాధ్యాయురాలు బిల్‌కిష్ బేగం అన్నారు. శనివారం మండలంలోని వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో ఆర్ట్ టీచర్ శ్రీదేవి ఆధ్వర్యంలో రంగోత్సవ్–2024 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్, కలరింగ్, క్యారికేచర్, హ్యాండ్ రైటింగ్ విభాగాల్లో పోటీలకు 46 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్, సిల్వర్, కాంస్య పతకాతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.